ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

గురువారం 11 జనవరి 2024

కష్టాలు తొలిగినట్లే..

విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌లకు ప్రభుత్వం ఊరట

- వేతనాలు, ఎంప్లాయ్ ఐడీలపై రాష్ట్ర సర్కార్ సర్క్యులర్ జారీ
- జిల్లా వ్యాప్తంగా 541 మంది ఉద్యోగులు



పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

తొర్రూరు, జనవరి 10 : బీఆర్‌ఎస్ సర్కారుపై పోరాడి ఉద్యోగాలను క్రమబద్ధీకరించుకున్న విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఊరటనిచ్చింది. వేతనాలు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేక గత 5 నెలలుగా వీఆర్‌ఏలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరి సమస్యను పరిష్కరించనుంది. వారు అనుకున్నట్లుగానే ఎంప్లాయ్ ఐడీ, వేతనాల అమలుపై ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. దీంతో మానుకోట జిల్లాలోని 541 మంది వీఆర్‌ఏలకు కష్టాలు తొలగనున్నాయి.

వేతనాలు అందక ..

విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌లుగా దశాబ్దకాలంగా సేవలు అందిస్తూ.. గత ప్రభుత్వంపై పోరాటం చేశారు. 80 రోజుల పాటు సమ్మె, వివిధ రూపాల్లో ఆందోళన చేయడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. కానీ, గత ప్రభుత్వం జాబ్ చాట్‌లను, ఉద్యోగ గుర్తింపు కార్డులను జారీ చేయలేదు. దీంతో ఐదు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో ఉన్న 541 మందిలో 50 మందికి పైగా 61 సంవత్సరాలు నిండిన వారు ఉన్నారు. వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా అది అమలులోకి రాలేదు. తమ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో అనే దానిపై నిరీక్షిస్తూనే ఉన్నారు. వీఆర్‌ఏలకు గతంలో తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నపుడు రూ.10,500 వేతనం చెల్లించేవారు. ఇప్పుడు విద్యార్హతలను బట్టి మూడు కేటగిరీల్లో సర్దుబాటు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌కు రూ.24,280, రికార్డు అసిస్టెంట్‌కు రూ.22,150, ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌కు రూ.18,000 వరకు వేతనాలు చెల్లించే విధంగా స్కేల్ పోస్టులో నియమించారు.

సర్క్యులర్ జారీపై హర్షం

వీఆర్‌ఏలకు ఎంప్లాయ్ గుర్తింపు కార్డు వేతనాలు చెల్లించడంపై ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడంతో జిల్లా పూర్వ వీఆర్‌ఏ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. గత దశాబ్దకాలంగా గ్రామీణప్రాంత పేద ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీఆర్‌ఏల పాత్ర ఎంతో కీలకంగా ఉండేదని, గత ప్రభుత్వం గుర్తించి వివిధ పోస్టుల్లో నియమించడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంప్లాయిస్ గుర్తింపు కార్డులు జారీ చేసి వేతనాలు చెల్లిస్తామనడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు.



జీవో జారీ చేయడం సంతోషం

- బెజ్జం భరత్ కుమార్, పూర్వపు వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్

కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్‌ఏల వేతన వెతలను గుర్తించి ఎంప్లాయీస్ ఐడీలు, వేతనాలపై జీవో జారీ చేయడం హర్షనీయం. గత ఐదు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న తమకు ఎంతో ఊరట కలిగింది. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఆయా కేటగిరీల్లో ఉన్న పూర్వపు వీఆర్‌ఏలందరికి ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తాననడం అభినందనీయం. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి దనసరి సీతక్కకు, ఇతర మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కారం చూపినందుకు ధన్యవాదాలు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

'చార్మినార్' రైలు ఘటనలో..

జిల్లా వాసులకు ముగ్గురికి గాయాలు

- తక్షణ సాయం కింద రూ.50 వేలు అందజేత
- ఇరువురిని లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలింపు



రైలు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న రైల్వే సిబ్బంది



గాయపడిన టి.లక్ష్మి

నెహ్రూసెంటర్, జనవరి 10 : హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రైలు పట్టాలు తప్పిన ఘటనలో మానుకోట జిల్లాకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న యాకూబ్‌పాష, బీఆర్‌ఎస్ మాజీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ ఇబ్రహీం ఆలీలు సంక్రాంతి పండుగకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో తమ పిల్లలను తీసుకువచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన టి.లక్ష్మి-శ్రీనివాస్ దంపతులు కొంతకాలంగా పెయింటింగ్ పని చేసుకుంటూ మహబూబాబాద్‌లో నివాసముంటున్నారు. కాగా, సెలవులకు ఇంటికి తీసుకువచ్చేందుకు వీరు కూడా ఇదే రైలులో తమ పిల్లల కోసం వెళ్లారు. మరికొద్ది క్షణాల్లో స్టేషన్‌లో దిగుతామని అనుకున్నలోపే నాంపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలు తప్పడంతో సైడ్ వాల్‌ని ఢీకొట్టింది. ఈఘటనలో యాకూబ్‌పాష కాలు విరిగింది. ఇబ్రహీం ఆలీకి చేయి విరిగింది. లక్ష్మి చేయికి స్వల్పగాయాలయ్యాయి. ఆ ముగ్గురిని దక్షిణమధ్య రైల్వే అధికారులు లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించి, చికిత్సనందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం తక్షణ సాయంగా ఇబ్రహీంఆలీ, యాకూబ్‌పాషాకు ఒక్కొక్కరికి రూ.50 వేల నగదును అందించినట్లు తెలిపారు. కాగా, లక్ష్మికి స్వల్పగాయాలు కావడంతో చికిత్సనందించారు. ఈ ప్రమాదఘటనలో బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అందులో మానుకోట జిల్లాకు చెందిన మరో కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది.

లైంగికదాడి ఘటనలో కేసు నమోదు

డోర్నకల్, జనవరి 10 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై లైంగిక దాడి కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రం రాజుతండాకు చెందిన బాదావత్ రాజు అనేవ్యక్తి రెండేళ్లుగా ఓ యువతి (22) వెంటపడి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. రాజు సోదరి సైతం

మిగతా 6వ పేజీలో

ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్‌శాఖల కార్యకలపాలను పరిశీలించేందుకు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ముందుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తమశాఖ పరిధిలో రెండు ప్రధాన విభాగాలు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం, సెర్ప్ విభాగాలు పని చేస్తున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో 461 గ్రామ పంచాయతీలు ఉండగా లక్ష్యానికి మించి పనులు జరిగాయని, ఉపాధి కూలీలకు 99 శాతం పేమెంట్ అందించగా రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానంలో ఉన్నామని డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య వివరించారు. 'మన ఊరు -మనబడి' కింద 316 పనులు ఐదు శాఖలద్వారా చేపట్టామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు పరిరక్షించేందుకు గాను చేపట్టిన పల్లెపకృతి వనాల్లో భాగంగా 702నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు. అనంతరం జిల్లా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాండింగ్ కమిటీలు, జనరల్ బాడీ సమావేశాల నిర్ణయాల ద్వారా పనులను చేపట్టి ప్రగతి సాధిస్తున్నామన్నారు. జిల్లాలో ఏడు కోట్లకుగాను నాలుగు కోట్లకు పైగా ఇంటి పన్ను వసూలు చేశామని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెట్ మిషన్ కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం నైపుణ్యత పెంచే దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని అదికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, నర్మద, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్‌కుమార్ సింగ్‌ను సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

యాసంగిలో సాగునీటి కష్టాలు రావొద్దు

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి, జనవరి 10 : రైతాంగానికి యాసంగిలో సాగునీటి కష్టాలు రావొద్దని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వల్లాద్రి ఉమామల్లారెడ్డి అధ్యక్షతనలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిగా హాజరయ్యారు. రైతులకు ప్రభుత్వ మద్దతు ధరతోనే యూరియా, పొటాష్ ఎరువులను విక్రయం జరిపేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని ఏవో కుమార్‌స్వామికి ఆయన ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానలోనే సుఖ ప్రసవాలను చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యానవన అధికారులు మిరప పంటల్లో చీడ పురుగులు ఆశించడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, హార్టికల్చర్ అధికారులు ఏనాడు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని దాట్ల సర్పంచ్ కొమ్మినేని రవీందర్ సభ దృష్టికి తీసుకోచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు, హార్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సారెస్పీ అధికారులు విడుదల అయిన సాగునీటి జలాలను గమ్యస్థానంకు చేరేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 30 కల్లా యాసంగిలో నీటి విడుదల ఉంటుందన్నారు. మిషన్ భగీరథ అధికారుల సమీక్ష వివరిస్తుండగా దాట్ల సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ 10 రోజులుగా నీటి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సభ ముగింపులో సర్పంచులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఎంపీపీ ఉమామల్లారెడ్డి, జడ్పీవైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవో అప్సరపాష, ఎంఈవో రామునాయక్, సర్పంచులు రవీందర్, సారంగపహణి, పెండ్యాల నరేస్, సుష్మిత, హిమబిందు, శైలజా పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు నిజాయితీగా పని చేయాలి..

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిజాయితీగా పనిచేసి గ్రామాల్లో ఆదర్శంగా నిలువాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీబాలాజీ గార్డెన్‌లో మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కష్టపడ్డ వారికే భవిష్యత్ ఉందన్నారు. సమిష్టి కృషితో రానున్న పార్లమెంట్‌తో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. డోర్నకల్ నియోజక వర్గంకు రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామానికి రూ.5 లక్షల చొప్పున నిధులు ఇస్తానన్నారు. అభివృద్ధిలో ఎలాంటి అవినీతిలేకుండా వెళ్లాలని లేకుంటే విమర్శించేందుకు తోడేళ్ల చూస్తుంటాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సతీష్, నాయకులు పొన్నోటి బాలాజీ, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భద్రూ, పోట్యానాయక్ పాల్గొన్నారు.

మహాజాతరకు పటిష్ట ఏర్పాట్లు

మేడారంలో పర్యటించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 10 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహాజాతరలో భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మేడారంలో పలుశాఖల అధికారులతో కలిసి ఆమె బుధవారం పర్యటించారు. మహాజాతర కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. హరిత హోటల్, పగిడిద్దరాజు, గోవిందరాజు భవనాలు, వీడియా పాయింట్, వాచ్ టవర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత హోటల్ పునరుద్ధరణ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరకల్లా హోటల్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరగనుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు. జాతర నిర్వహణ పనుల్లో వేగం పెంచి త్వరగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, ఇంజనీరింగ్ అధికారి అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పశు వైద్య బృందం పర్యటన

మేడారంలో పశు వైద్య బృందం పర్యటించింది. మహాజాతర సమయం దగ్గర పడుతున్న క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన కోళ్ల దుకాణాలను సందర్శించారు. షాపుల్లో కోళ్లు రోగాల బారినపడి మృతి చెందుతున్నాయని, పలువురు వ్యాధి సోకిన కోళ్లను అమ్ముతున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో పర్యటించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పశు సంవర్ధక జిల్లా వైద్యాధికారి విజయభాస్కర్ నేతృత్వంలో ఆశాఖ అధికారులు కోళ్ల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ హోల్‌సేల్ వ్యాపారులు వైద్యుల సలహాలు, పర్యవేక్షణ లేకుండా కోళ్లను సరఫరా చేయడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. మేడారంలో టన్నులకొద్దీ మాంసం విక్రయాలు జరుగుతున్నాయని, నాణ్యత విషయంల ఎవరికైనా అనుమానం వస్తే వెంటనే పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ నర్సింహ, గోపాలమిత్ర సభ్యుడు బాలరాజు తదితరులు ఉన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

రూ.10 లక్షల ఆదాయం ● జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్



వేలం పాట నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు


తొర్రూరు, జనవరి 10 : గుడుంబా, బెల్లం అక్రమ రవాణాలో స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసిన వాహనాలను బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా అధికారి కిరణ్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో నాలుగు చక్రవాహనాలతో మొత్తం 26 వాహనాలకు వేలం వేశారు. వాటి జీఎస్టీతో కలిపి రూ.10, 89,400 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మరో 15 రోజుల్లో మరో 40 వాహనాలకు వేలం పాట ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, ఎస్సై రవళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కొవిడ్‌కు పూర్వం ఉన్న రైళ్లను పునరుద్ధరించాలి'



జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

డోర్నకల్, జనవరి 10 : దక్షిణ మధ్యరైల్వే పరిధిలో కొవిడ్‌కు పూర్వం ఉన్న రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు షైనూపాష, ఖాదర్ దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక రైళ్లో వచ్చిన జీఎంకు స్థానిక స్టేషన్‌లో పలు రైళ్ల పునరుద్ధరణపై విన్నవించారు. బెలగావి-మణుగూరు మధ్య నడిచే సోలాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రస్తుతం కాజీపేట వరకు నడిపిస్తున్నారని, దానిని మణుగూరు వరకు పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కోరారు. కాకతీయ, ప్యాసింజర్, పుష్‌పుల్ రైళ్లను కూడా పునరుద్ధరిస్తే సామాన్య ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్‌జైన్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, సీనియర్ డీవోఎం సురేష్‌రెడ్డి, ఐవోడబ్ల్యూ ద్రోణాచార్య, సీనియర్ టీఆర్డీ సురేష్, డోర్నకల్ ఎస్ఎస్ శోభన్‌ప్రసాద్, డోర్నకల్‌కు చెందిన వ్యాపార ప్రముఖుడు మహేందర్‌కుమార్‌జైన్ ఉన్నారు.







కేయూ పరీక్ష కేంద్రాలను సందర్శించిన వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కేయూ క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో నిర్వహిస్తున్న పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నగరంలోని గీతాంజలి, మాస్టర్‌జీ, సిటీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అధనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యూలర్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ పరిధిలో బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు బుధవారం తెలిపారు. రెగ్యూలర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ హాజరుకావాలన్నారు.

కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను పరిశీలిస్తాం

▸▸ రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్ రెడ్డి


కేసముద్రం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మణుగూర్, ఇంటర్‌సిటీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్‌ను పరిశీలించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణీకులు ఆయనకు రైళ్ల హాల్టింగ్‌పై విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని, త్వరలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటే మూడో లైను నిర్మాణంతోపాటే ప్లాట్‌ఫాలపై ఫుల్‌కవర్‌షెడ్లు, డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌పై ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వరంగల్‌కు అప్‌అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, స్థానికులు వోలం శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తొను పునూరి భాస్కర్, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపేందర్ ఉన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 10 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో సందడి నెలకొంది. మహాజాతరకు ముందుగానే భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం సుమారు 30 వేల మంది తల్లుల దర్శనాలు చేసుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. చల్లగా చూడాలని వేడుకున్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఐనవోలు జాతరలో వాకిటాకీ సేవలు

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో దేవస్థానం అధికారులు వాకిటాకీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రమే వాకిటాకీల ద్వారా బందోబస్తు విధులు నిర్వర్తించేవారు. గత జాతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం పరిశీలన, బోనం, పట్నాల టిక్కెట్ల విక్రయాలు, లడ్డుప్రసాదం అమ్మకాల వద్ద భక్తుల రద్దీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవిధంగా ఆయా విభాగాలు చూసే

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్

వడ్డెపల్లి, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టానికి నిరసనగా గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 చట్టంలో భాగంగా డ్రైవర్‌లపై మోపిన చట్టం వలన డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్షా, రూ. 7 లక్షల జరిమానాను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్, జనవరి 10: ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ జాతీయ సేవ పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కేయూ ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన వారిలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సీహెచ్. అక్షయశ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎ.ఇష్రితా, కోఎడ్యుకేషన్ మహిళ ఇంజరింగ్ కళాశాల నుంచి ఎల్.అనిల్ కుమార్, వర్సిటీ ఫార్మసీ కళాశాల నుంచి పి.సందీప్‌లు ఉన్నారని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు.

నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీ భూములు ఇవ్వొద్దు

కేయూ క్యాంపస్, జనవరి 10: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని కేయూ ఏబీవీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ మాట్లాడారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

▶▶ రూ. 5 లక్షల 50 వేల జరిమానా

వరంగల్ లీగల్, జనవరి 10 : మూగ, మానసిక వికలాంగురాలైన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 లక్షల 50వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వై.సత్యేంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. అదే విధంగా బాధితురాలికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి రూ. 5 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మంగమ్మతోట మార్కండేయ నగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక పుట్టుకతోనే మూగ, మానసిక వికలాంగురాలు. ఎప్పటిలాగే బాధితురాలిని ఇంటి వద్ద ఉంచి 2019 నవంబరు 7న పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న కూతురుని అడుగగా తనకు కడుపునొప్పిగా ఉందని వారికి సైగలతో చెప్పడంతో ఏమి జరిగిందని అడుగగా 6వ తేదీన మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన తేజావత్ హచ్చు అలియాస్ రమేశ్ ఇంటిలోకి వచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. గతంలో కూడా రెండు సార్లు అత్యాచారానికి పాల్పడినట్లు సైగల ద్వారా తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడి తేజావత్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5 లక్షల 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

'విద్యాభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి'



పీఆర్టీయూ-టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 10 : విద్యాభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లో పీఆర్టీయూ- టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు పాటుపడాలని సూచించారు. పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ మాట్లాడుతూ నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని, బకాయిలో ఉన్న మూడు డీఏలను సంక్రాంతి కానుకగా ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు బి.గీత, టి.మురళీధరస్వామి, వై.ఉమాదేవి, శ్యామలాదేవి, కనకయ్య, హల్యానాయక్, వెంకన్న, కళ్లెం వెంకట్‌రెడ్డి, భూక్య రామోజీనాయక్, శంకర్, సుజాత, చిట్టిబాబు, శేఖర్, అశోక్, వెంకన్న, రమాదేవి, సునిత, నర్సింహారావు పాల్గొన్నారు.

13న ఉషోదయ వాకర్స్ ముగ్గుల పోటీలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 10 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3016, ద్వితీయ రూ.2016, తృతీయ స్థానానికి రూ.1,016 నగదు పారితోషికాన్ని అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగన మహిళలు సెల్ : 83412 01119కు ఫోన్‌చేసి తమపేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో..

మానుకోట పట్టణంలోని సీపీఐ కార్యాలయం (వీర భవన్) వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ తెలిపారు. మొదటి బహుమతిగా రూ.5,016, రెండో బహుమతిగా రూ.3016, మూడోబహుమతిగా 2016, నాలుగో బహుమతిగారూ.1016 అందించనున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారుసెల్ : 98664 79666, 99593 43360, 96660 38001 ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పొక్లైనర్ డ్రైవర్ మృతి

నెల్లికుదురు, జనవరి 10 : మండలంలోని బడితండా శివారు సొసైటీతండాకు చెందిన భూక్య సురేష్ (28) చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి చెందినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఈనెల 7న భూక్య సురేష్ అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగాడు. వెంటనే తండావాసులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య భూక్య కైకా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించిన్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూసెంటర్, జనవరి 10 : వైద్య, ఆరోగ్యశాఖ నియమనిబంధనలను అతిక్రమిస్తూ కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీషకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వివిధ పరీక్షల పేరుతో పేదల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూక్య బాలాజీ, భూక్య శ్రీను, కేలోతు మల్సూర్, దారావత్ రమేష్ ఉన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

● జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి

మహబూబాబాద్ రూరల్, జనవరి10 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందు సాగినప్పుడే.. ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వళన చేసిన అనంతరం లూయిబ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవలోపం ఉందని కుంగిపోకుండా మంచిగా చదువుకుని, ఉన్నతస్థానాల్లో ఉండాలన్నారు. జిల్లాలో దివ్యాంగులకు ఏమైన సమస్యలు, అవసరాలు ఉంటేతన దృష్టికి తీసుకురావాలని, ఉన్నతాధికారుల వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చంకకర్రలు, బ్యాటరీ ట్రైసైకిల్, స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, వీల్‌చైర్‌లను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని చెప్పారు. జిల్లాలో ఉన్న బ్యాక్‌లాగ్‌పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలోనే కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష మాట్లాడుతూ ఇంకా ఎవరైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ రానివారు ఉంటే స్లాట్ బుక్‌చేసుకుని క్యాంపునకు హాజరు కావాలన్నారు. అనంతరం ఆయా క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా దివ్యాంగ సంఘాల ప్రతినిధులు బూర్ల ఉపేందర్‌గౌడ్, నూనావత్ రాములు, దేవులపల్లి సునీల్, గుండు రవి, దుగ్గి సారయ్య, పోలెపాక శంకర్, రషీద, సమ్మెట కృష్ణయ్య, వీరన్న, సీహెచ్.సుధాకర్, రాంబాబు, సంపత్, కందుల కృష్ణ, మోహన్, కార్యాలయ సిబ్బంది బల్లెం వెంకన్న, కత్తి బిక్షపతి, బి.రాజు, వరప్రసాద్, వాణి, ఉష, దివ్యాంగులు పాల్గొన్నారు.

లైంగిక దాడి ఘటనలో కేసు నమోదు

(3వ పేజీ తరువాయి)

రెండుతులాల బంగారం ఎదురిచ్చి తనతమ్ముడితో పెళ్లి చేయిస్తానని నమ్మించింది. ఈ క్రమంలో రాజు పలుమార్లు ఆ యువతితో శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో పెళ్లి ఎప్పుడు చేసుకుందామని యువతి అడగడంతో నిన్ను వివాహం చేసుకోవడం తనకు ఇష్టంలేదని, నిరాకరించాడు. దీంతో రాజు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆ యువతి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో రాజుపై లైంగిక దాడి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, తన తమ్ముడికి ఇచ్చి పెళ్లిచేస్తానని నమ్మబలికిన రాజుసోదరి రాజేశ్వరిపై కూడా యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నిబంధనలు తూచ్

- అనర్హులను.. బోధనేతర సిబ్బందిగా నియామకం
- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్వాకం
- మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో వెలుగు చూస్తున్న వైనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 10 : జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా బోధనేతర సిబ్బంది నియామకాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. భర్తీ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. తాజాగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో మైనార్టీ సంక్షేమాధికారి నిబంధనలు పాటించకుండా, ఉద్యోగ నియామకాల కోసం డబ్బులు తీసుకొని అనర్హులకు ఇవ్వడంతో తనకు దక్కాల్సిన తొర్రూరు మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన హౌస్‌కీపింగ్ వర్కర్ ఉద్యోగం ఇతరులకు పోయి.. తనకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ తొర్రూరుకు చెందిన నసీమా ఫిర్యాదు చేశారు. దీంతో మరికొంత మంది కూడా తమకు అన్యాయం జరిగిందని 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం తమ ఆవేదనను వెలిబుచ్చారు.

డోర్నకల్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసం..

డోర్నకల్ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు నియామకానికి 9 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారికి మహబూబాబాద్ బాలుర గురుకుల పాఠశాలలో అక్టోబర్ 2023లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త తెనుగుల శ్రీనివాస్, విజిలెన్స్ అధికారులు మక్బుల్‌పాషా, సయ్యద్ అక్బరుద్దీన్, అంజాద్‌అలీ కమిటీ నేతృత్వంలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూ టెక్నికల్ పరీక్షలు జరిపారు. వారిలో మెరిట్ ప్రాతిపదికన ముగ్గురి పేర్లను తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి అందజేసినట్లు సమాచారం. కాగా, ఈ ముగ్గురిలో జిల్లా కేంద్రానికి చెందిన షాహిన్ సుల్తానాకు నియామకపత్రాన్ని అందజేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారికి సమాచారం అందించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను జిల్లా సంక్షేమాధికారి విస్మరిస్తూ నెలరోజుపాటు కాలయాపన చేసి, త్రిసభ్య కమిటీ సూచించిన ముగ్గురిలో కాకుండా.. వేరే వారి నుంచి రూ.2 లక్షలు తీసుకొని నియామకపత్రాన్ని ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి.

జిల్లాలో మరో ఇద్దరి నియామకం..

జిల్లాలోని మరో రెండు మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సంబంధిత అధికారులకు తెలియకుండా బోధనేతర సిబ్బందిని నియమించినట్లు విశ్వసనీయ సమాచారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలలో ఒకరు, తొర్రూరు బాలికల గురుకుల పాఠశాలలో మరొకరిని రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే.. మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగ నియామకాల విషయంలో అవినీతికి పాల్పడుతూ, నిబంధనలకు విరుద్ధంగా బోధనేతర సిబ్బంది భర్తీ చేపట్టిన జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా! లేదా? వేచిచూడాల్సిందే. కాగా, ఈ విషయంపై జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా అలాంటిదేమి లేదని వివరణ ఇచ్చారు.

'క్రీడల్లో గెలుపోటములు సహజం'

గూడూరు, జనవరి 10 : క్రీడలలో గెలుపోటములు సజజంగా తీసుకోవాలని స్త్రీశిశు, పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క తనయుడు సూర్యం అన్నారు. మట్టేవాడలో కొమురంభీమ్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల స్థాయి వాలీబాల్, కబడ్డీ క్రీడలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో క్రీడల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్పంచ్ ఈసం సంధ్యసూర్యనారాయణ, ఉపసర్పంచ్ అనిల్, యూత్ సభ్యులు రమేష్, వీరస్వామి, కిశోర్, రాజేష్, కొట్టయ్య, రేగ వెంకటేశ్వర్లు, లింగాల కిరణ్, ఉదయ్, మహేష్, రాజేష్, రంజిత్, మహేష్, మణికంఠ, శ్యాం, నగేష్ పాల్గొన్నారు.

● గూడూరులో శివాజీ యువసేన ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను సీఐ ఫణిదర్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రోజారాణి, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ భన్సీలాల్‌లు ప్రారంభించారు. క్రీడకారులకు టీషర్టులను అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టి వెంకన్న, కొమ్మాలు, శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, బొల్లికొండ మధు, పొన్నం వెంకన్న, గాదె సాగర్, వంశీకృష్ణ, రంజిత్, దిలీప్‌రెడ్డి, నితిన్ పాల్గొన్నారు.

క్రీడలతో యువత మధ్య స్నేహభావం

కురవి, జనవరి 10 : క్రీడలతో గ్రామాలు, యువత మధ్య స్నేహభావం పెరుగుతుందని డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ అన్నారు. బలపాలలో బలపాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు ఉమ్మడి జిల్లాలో కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు గ్రామసమస్యలపై దృష్టిపెట్టి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. క్రీడల్లో రాణించిన యువకులు జీవితంలో సైతం రాణిస్తారని అన్నారు. సర్పంచ్ ముండ్ల ప్రమీల, ఎంపీటీసీ వెంకటరమణ, రూరల్ సీఐ రమేష్, కురవి ఎస్సై బైర గోపి, నామ సైదులు, బత్తుల వెంకన్న, అంబటి వెంకటనారాయణ, మలేడి కోటయ్య, నెల్లూరి నాగేశ్వర్‌రావు, పిట్టల వెంకన్న, సందీప్, కాసాని అనిల్, అబ్బాస్, రాకేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్

నర్సింహులపేట, జనవరి 10: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్ ఉంటుందని ఎస్సై సతీష్ అన్నారు. పెద్దనాగారంలో బహుజన సమైక్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

మరిపెడ, జనవరి 10 : మరిపెడ మున్సిపల్ పుర వీధుల్లో శ్రీరాముడి భక్తులు కోలాట నృత్యాలు, శ్రీరాముడి నగర సంకీర్తనలతో జైశ్రీరాం జైజై శ్రీరాం అంటూ నినదించారు. బుధవారం అయోధ్యరాముడి అక్షింతలను మెయిన్‌రోడ్డులోని ప్రతీ ఇంటికి అందచేశారు. ధనుర్మాసంలో భాగంగా రామాలయ నిర్వాహకులు గోదాదేవిని ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. అర్చకులు వెంకటశ్రీమన్నారాయణ చార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కాంతారావు, మురళీకృష్ణ, సురేశ్, శ్రీనివాస్, రాంబాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటింటికి అయోధ్యలో పూజింపబడిన అక్షింతలను పంపిణీ చేపట్టారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పలు వార్డుల్లో రామభక్తులు ఇంటింటికి వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ప్రజలందరు తమ ఇండ్లను శుభ్రపర్చుకుని రంగులతో అలంకరించుకుని రామనామం జపిస్తూ శ్రీరాములవారికి స్వాగతం పలకాలన్నారు. ప్రధాని మోడీ పిలుపుమేరకు ఆరోజు సాయంత్రం ఇంటి ముందు దీపాలు వెలిగించాలన్నారు. పండుగ వాతావరణంలా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శివకుమార్, కుమారస్వామి, రామారావు, పల్లె కుమార్, రుద్రదేవ్, జమున, భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్లో రైతులకు అన్నదానం

కేసముద్రం, జనవరి 10 : కేసముద్రం లయన్స్‌క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్, స్థానిక వ్యాపారి వోలం ప్రభుకిరణ్ ఆధ్వర్యంలో మార్కెట్లో రైతులకు, కార్మికులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. దీనిని మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్ కుమార్, చార్టర్ ప్రెసిడెంట్ కె.చంద్రశేఖర్, పాస్ట్ జడ్‌సీ యర్నం శ్రీరాములు, కరుణాకర్, గ్రేడ్-3 కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఆకాశ్ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నగూడూరు, జనవరి 10 : మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రభుత్వంచే గుర్తింపు పొందిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యూపీపీటీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌లను బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రవికుమార్ ఆవిష్కరించారు. ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, జిల్లా సభ్యులు సోనీ, శ్రీనివాస్, సతీష్, సురేష్, ఉపాధ్యాయులు రెహమాన్, లలిత, నాగేశ్వరరావు, రఘపతి, పుష్పలీల, నాగార్జున, సునీత, హరిచంద్, శ్రీలత, సరోజ పాల్గొన్నారు.

'భక్తులు తరలిరావాలి'

కేసముద్రం, జనవరి 10 : మండలంలోని అమినాపురంలో శ్రీభూనీళా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోదా అమ్మవారికి అభిషేకం, నూతన వధువుగా అలంకరణలు చేశారు. 108 పాత్రల్లో రంగనాథ స్వామికి ప్రసాదం సమర్పించి, పూజల్లో పాల్గొన్నారు. ఈనెల 14న నిర్వహించే గోదారంగనాథస్వామి కల్యాణోత్సవానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు వోలం మురళి, ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ధర్మకర్తలు వోలం రాజేశ్వర్‌రావు, వద్దిరాజు దేవేందర్, లక్కాకుల నర్సయ్యలు కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 10 : చట్టాలపై సరైన అవగాహన ఉన్నప్పుడే వాటిని సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సహకార సంఘాల సిబ్బందికి సహకార సంఘాల చట్టం, నిబంధనలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ సహకార కళాశాల ప్రిన్సిపల్ యాకూబ్ పాల్గొని అవగాహన కల్పించారు. రాజయ్య, వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ప్రవీన్, రాజేష్, గౌస్, యాకూబ్‌అలీ, అఫ్జలుద్దీన్, శ్రీనివాస్, గోపీనాథ్, రాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు, జనవరి 10: అంబులెన్సులో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 108 (జీవీకే) అంబులెన్సుల జిల్లా ఇన్‌చార్జి బిమహేష్ అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో 108 వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని, అంబులెన్సులో అన్ని పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలు 108 సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైలట్ నవీన్, ఈఎంటీ రఘు ఉన్నారు.

జడ్పీటీసీకి రాజీనామా చేయాలి

చిన్నగూడూరు, జనవరి 10 : మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ను విమర్శించే ముందు ఆయన అవకాశం కల్పించిన జడ్పీటీసీ పదవికి మూల సునీతామురళీధర్‌రెడ్డి రాజీనామా చేసి మాట్లాడాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దుండి మురళి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో ఆయన మాట్లాడారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాగంటి శ్రీను, బీఆర్ఎస్ కోశాధికారి యాకుబ్‌రెడ్డి, తుడుం ప్రసాద్, డానియల్, శ్రీకాంత్, అనిల్ ఉన్నారు.

'సీపీఐని విస్తరింప చేయాలి'

మరిపెడ, జనవరి 10 : పల్లెపల్లెనా సీపీఐ పార్టీని విస్తరింప చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ఆ పార్టీ కార్యవర్గ సమావేశం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ శతదినోత్సవం సందర్భంగా పార్టీ సభ్యత్వాలను పెంచటానికి సీపీఐ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రైతుల రుణమాఫీకి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రైతు బంధు ఇవ్వాలన్నారు. మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, పోలెపాక వెంకన్న, నారాయణ, అంజి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ

మరిపెడ, జనవరి 10: విద్యార్థుల టాలెంట్ కోసం ప్రతీ సంవత్సరం జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి పోటీల పోస్టర్లను బుధవారం తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో ధన్‌సింగ్ స్థానిక సీతారాంపురం స్కూల్లో ఆవిష్కరించారు. 7, 8, 9వ తరగతి చదువున్న విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు అర్హులని నిర్వాహకులు తెలిపారు. పాఠశాలస్థాయి జనవరి 19, మండలస్థాయి 27వతేదీన, జిల్లాస్థాయి ఫిబ్రవరి 3న, రాష్ట్రస్థాయి పోటీలు జనవరి 9, 11న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి లింగంపల్లి దయానంద్ పేర్కొన్నారు. హెచ్‌ఎం రాంచంద్రు, రామ్మోహన్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.



జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వయం పరిపాలనా దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెద్దనాగారం ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి10 : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయుల సంప్రదాయ దుస్తులు ధరించి, విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మం, శ్రీవాణి, మధుసూదనాచారి, న్యాయనిర్ణేతలుగా రామకృష్ణ, శ్యాంప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● నర్సింహులపేట : మండలంలోని పెద్దనాగారం ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వహించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అనంతుల స్వామిక, డీఈవోగా అజ్మీర అనూష, ఎంఈఓగా అజ్మీర దివ్య, హెచ్‌ఎంగా ఎ.మోహన్ ఒకరోజు బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం జానకీసుమన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాలల్లో రాణించాలన్నారు. పట్టుదలతో శ్రమిస్తే దేనినైనా సాధించవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు సికిందర్, ఎం.రవి, లచ్చు, నగేష్, భాగ్యలక్ష్మి, రాజు, బాలవేను, మల్లయ్య శ్యామల పాల్గొన్నారు.

'పిల్లల అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 10 : పిల్లల అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిలా సాధికారత కేంద్రం జెండర్ ప్రత్యేకాధికారిని అరుణ అన్నారు. మునిసిపల్ పరిధిలోని ఈదులపూలసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా మహిలా సాధికారత కేంద్రంలో ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ...బాలికల హక్కులకు భంగం కాలగకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు లింగ వివక్షత చూపరాదన్నారు. చిన్న నాటినుంచే పిల్లలకు పౌష్టిక ఆహారం అందించి ఆరోగ్యవంతంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అపరితుల నుంచి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ : 1098, 181, 100. 1930లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న, వీరన్న, సంధ్యారాణి, రాకేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల కంప్యూటీకరణ పూర్తి

మరిపెడ, జనవరి 10 : మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో ప్రజాపాలన ఆరుగ్యారెంటీల అమలు కోసం 4965 దరఖాస్తులు రాగా బుధవారంతో ఆ దరఖాస్తుల కంప్యూటీకరణ పూర్తి చేయడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. దరఖాస్తుల కంప్యూటీకరణ పూర్తి చేసిన అపరేటర్లను ఆయన అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

తొర్రూరు, జనవరి 10: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాసులు అన్నారు. బుధవారం జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.నారాయణ, లక్ష్మీనారాయణ, రమేష్, కుమారస్వామి, సువర్ణ, నర్సయ్య, మల్లయ్య, చారి పాల్గొన్నారు.

నియంత పాలనకు చరమగీతం

పెద్దవంగర, జనవరి 10 : నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమవేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, సీనియర్ నాయకులు దుంపల శ్యామ్, వేముల వెంకన్న, తోటకురి శ్రీనివాస్, గోపాల్, సీతారామ్‌నాయక్, జగ్గానాయక్, వెంకన్న, రవి, శ్రీనివాస్, కర్ణాకర్‌రెడ్డి, తస్నీరు వేణు, యాకన్న, జానీ పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లు లేక ఇబ్బందులు



పెనుగొండ శివారులో తోటలో మిర్చిని ఏరుతున్న కూలీలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 10 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లో ప్రతిరోజు మిర్చి కొనుగోళ్లు లేకపోవడంతో మిర్చిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిర్చి కొనుగోళ్లు మార్కెట్‌లో లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్‌లకు, చిల్లరకాంటల వద్దకు వెళ్లి పడిగాపులు కాస్తూ తక్కువ ధరలకే మిర్చిని ఖరీదులు చేస్తూ రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 68 వేల ఎకరాల విస్తీర్ణంలోనే మిర్చి పంటను సాగు చేశారు. ప్రస్తుతం మిర్చి కోతలు ఊపందుకున్నప్పటికి మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రతిరోజు మిర్చి కొనుగోళ్లు ప్రారంభించలేదు. గత కొద్ది నెలల నుంచి ప్రతి మంగళ, గురువారం మాత్రమే మిర్చి కొనుగోళ్లు చేపడుతున్నారు. ఆ రెండ్రోజులు కేవలం నామమాత్రంగానే మిర్చిన కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఖమ్మం, వరంగల్ లాంటి మార్కెట్‌లో మిర్చి క్వింటాకు రూ.20 వేల వరకు ఖరీదులు చేస్తున్నప్పటికి రైతులు అంతదూరం వెళ్లలేక కోల్డ్‌స్టోరేజ్‌లకు వెళ్తున్నారు. మిర్చి కొనుగోళ్లు ప్రారంభించడానికి మార్కెట్ కార్యదర్శి గత రెండ్రోజుల క్రితం మిర్చి వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికి వ్యాపారులు రాకపోవడంతో వాయిదా పడింది. ప్రతి రోజు మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

ధరణి భూ వివాదాల పరిష్కార కమిటీలో సునిల్‌కు చోటు



కురవి, జనవరి 10 : ధరణి ప్రక్షాళనకు ఇటీవల నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి సమస్యల పరిష్కార కమిటీలో అయ్యగారి పల్లికి చెందిన మేక సునీల్ రెడ్డి (భూమిసునిల్) నియామకమయ్యారు. రాష్ట్రంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలో భూ సమస్యల పరిష్కార నిపుణుడు సునీల్‌రెడ్డి ఎంపిక కావడం పట్ల కురవి మండలంతో పాటు జిల్లాలో హర్షాతిరేఖాలు వెలువడుతున్నాయి. ఐదుగురు సభ్యులు ఎం.కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమాండ్‌పీటర్, నవీన్‌మిట్టల్, డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌లతో పాటు ఏర్పాటైన కమిటీలో అడ్వకేట్ సునీల్‌రెడ్డి సభ్యుడిగా నియామకమయ్యారు. సునీల్‌రెడ్డి నియామకం పట్ల జిల్లాలో మేధావులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.